# శోభాయమానమైన సాయంత్రం

## డా. శోభారాజు గారి కచేరీ విశేషాలు

ఆగస్టు 31వ తేదీ సాయంత్రం సెయింట్ లూయిస్ దేవాలయ ప్రాంగణములో అన్నమాచార్య కీర్తన వినిపిస్తోంది. పిల్లలు పెద్దవాళ్ళు అంతా నిశ్శబ్దముగా, వేంకటేశ్వర స్వామి సాక్షాత్కరించాడా అన్నట్లు పారవశ్యము పొందుతూ, ఆ స్వామి సేవలో సేదతీరుతున్నట్లు అనుభూతిని పొందారని అంటే అతిశయోక్తి కాదేమో! అనుభవించిన వారినే అడగాలి. డాక్టర్. శోభారాజు గారి ఈ కచేరీలో నేను విన్నది, నాకు అర్థమైనంత వరకు మీతో పంచుకొనే ప్రయత్నం చేస్తున్నాను.







అన్నమ గాయత్రి, నారాయణ మంత్రముతో మొదలుపెట్టి గురువుని, దైవాన్ని స్మరించిన తరువాత - శోభారాజుగారు "వేడుకొందామా! వేడుకొందామా!! వేడుకొందామా వేంకటగిరి వేంకటేశ్వరుని వేడుకొందామా!!" అంటూ, ప్రేక్షకులు కూడా మైమరచి తాళము వేస్తూ ఉంటే, వేంకటేశ్వరుని భజించారు. తరువాత చక్కని ఓ హిందీ యుగళగీతము "తుమ్ సె ముహబ్బత్ హోగయి హై ... " అంటూ చివరిలో "బాలాజీ" అని చేర్చి - "ఇలాగ కూడా పాడవచ్చండి. బాలాజీ అని చివర లేకపోతే అది యుగళగీతం. ఉంటే భక్తిగీతం. అంతేనండి!" అనగానే ప్రేక్షకులు కరతాళ ధ్వనులు చేసారు. చెప్పదలచుకొన్న విషయాన్ని చక్కని ఉదాహరణలతో, చక్కని వివరణతో జీవితకాలము గుర్తుండే విధముగా చెప్పడము ఆమెలో ప్రత్యేకత. తరువాత "దొరయైన చాలు కడు తుచ్ఛపు బంటైన చాలు ... ఎందు జనించిన నేమి? ఎచ్చోటనున్ననేమి? .. తలపు నీ పాదముల తగులుటే చాలు" అంటూ కీర్తిస్తుంటే కళ్ళవెంట అసంకల్పితముగా నీళ్ళు వెలువడ్డాయి.

మనసు పరి పరి విధముల ఆత్మావలోకనము చేసుకోసాగింది. "నేనో పామరుడను. నిన్ను స్తుతించాలంటే నా దగ్గర సరితూగు పదములు లేవు. నిన్ను పూజించడానికి సుగంధములు వెదజల్లే పుష్పములు నాదగ్గర లేవు. నైవేద్యము సమర్పిద్దామంటే కమ్మనైన ఫలములూ నాదగ్గర లేవే! నిన్నెట్లా కొలిచేదయ్యా!! విజ్ఞానాన్ని నాలో పెంచి, ఒక దీపము మరొక దీపాన్ని వెలిగించినట్లు, నన్నో సేవకునిగా విజ్ఞాన దీపాన్ని దేదీప్యమానముగా నలుగురిలో వెలిగించే భాగ్యాన్ని నాకు కలిగించవయ్యా! అడగకుండానే ఎన్నో ఫలములనొసగే నీకు నేనర్పించగలిగిన ఫలమేముంది, నేను తలపెట్టిన సత్కార్యముల ఫలము తప్ప. పూర్వజన్మ వాసనలతో జీవన్మరణ చక్రములో కొట్టుకుపోతున్న నా దగ్గర నిన్ను పూజించడానికి ఏముంది - హృదయ కుసుమం తప్ప. నీకు పాద్యం సమర్పించడానికి గంగా తీర్థము నేనెక్కడ తేగలనయ్యా! నీ భక్తి పారవశ్యములో చెమర్చిన నా కన్నీటితో నీ కాళ్ళు కడగనీయవయ్య. నీకు నైవేద్యముగా నేనేమి సమర్పించనయ్యా! ఆత్మ నివేదన తప్ప. అనంతుడవైన నిన్ను ఆహ్వానించడానికి మా ఇరుకు గృహములు సరిపోతాయా? మా హృదయములోనే కొలువుండరాదటయ్యా! మాకు ఆ అర్హత ఇవ్వవలసినది కూడా నీవే కదా." ఇలా సాగాయి ఆలోచనలు ఆ క్షణములో.

తరువాత "కొండలలో నెలకొన్న కోనేటిరాయడువాడు ..." కీర్తన ఆలాపిస్తుంటే పిల్లలు కూడా శృతి కలిపి పాడడం అన్నమయ్యకు ఘనమైన నివాళి. తరువాత శోభారాజుగారు స్వయముగా రచించిన "అమ్మా మాయమ్మ అలిమేలు మంగమ్మ" గీతాన్ని పాడి వినిపించారు. అనంతరము "జాలో... జాలి, జాలో... జాలి" కీర్తనను వినిపించారు. అంతా అయిపోయాక చివరిలో మళ్ళీ "జాలో... జాలి" అంటారని ప్రేక్షకులు నిరీక్షిస్తుంటే "పాట అయిపోయిందండి" అని చమత్కరించడంతో అంతా హాయిగా నవ్వుకున్నారు. జాలి పాట అర్థమును వివరిస్తూ, దైవ నివాసమైన మన మనసును (అజ్ఞానమనే చీకటిలో ఉన్నప్పుడు) అరిషడ్వర్గాల బారిన పడకుండా పహరా (కాపలా) కాయడమని - మేల్కొన్న తరువాత (జ్ఞానమనే వెలుగులోకి వచ్చిన తరువాత) పహరా కాయవలసిన అగత్యము లేదని తెలియజేసారు.

నేటి ప్రకృతి వైపరిత్యాలకు, అకాలమరణాలకు మన మానసిక స్థితి కారణమని - వాతావరణ కాలుష్యము అదుపుచెయ్యడానికి ఆలోచిస్తున్నాము గాని, కలుషితమైన ఆలోచనలను (Thought pollution) అదుపుచేసే ప్రయత్నము చెయ్యడములేదని - అనుక్షణం వ్యధతో, ఎంత సంపాదించినా తృప్తి లేక, మనసులో కల్లోలాన్ని సృష్టించుకుంటూ, ఆ ప్రభావాన్ని ప్రకృతికి ఆపాదిస్తున్నామని చెప్పడము పలువురిని ఆలోచింపజేసింది.

తరువాత మధుర భక్తి, శృంగార భక్తి అంటే వివరిస్తూ, చూసే దృష్టిని బట్టి ఆ కీర్తనలలోని మాధుర్యం ఆస్వాదించవచ్చునని చెప్పారు. ఈ సందర్భములో

"ఏమొకొ చిగురుటధరమున ఎడనెడ కస్తూరి నిండెను
భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదు కద ||
కలికి చకోరాక్షి కడ కన్నులు కెంపయి తోచిన
చెలువంబిప్పుడిదేమో చింతింపరే చెలులు
నలువున ప్రాణేశ్వరునిపై నాటిన ఆ కొన చూపులు
నిలువున పెరుకగ అంటిన నెత్తురు కాదుకద ||"

కీర్తన అర్థాన్ని వివరించారు. పడక గదినుండి వస్తున్న అలిమేలు మంగమ్మ అధరములు ఎర్రగా ఉన్నవేమని ఒక చెలికత్తె అడిగితే, మరొక చెలికత్తె "బహుశా భర్తకు తన పెదవులతో లేఖ వ్రాసిందేమోనని" సమాధానము చెప్పడము. "చకోర పక్షి కన్నులను పోలిన ఆమె కళ్ళు పగడంపు రంగు తేలినవి. కారణం ఊహించగలరా?" అని ఒక చెలికత్తె అడిగితే, "అమ్ములవలే పదునైన తన కొన చూపును మగనిపై నాటి, అకస్మాత్తుగా పెరికిందేమో - రక్తపు చారికలు ఆమె కంటిని ఎర్రగా చేసి ఉంటాయని" బదులు పలకడములో రమ్యమైన వర్ణనను విశదీకరించారు.

మనకు కలిగిన కష్టాన్నైనా, ఆనందాన్నైనా వేంకటేశ్వరునితో నివేదించుకుంటే, ఆయనకే ఫలితాన్ని అర్పిస్తే బ్రహ్మానందమనేది సాధ్యమవుతుంది. అదే అన్నమయ్య బాట. స్వామిలో చిలిపితనాన్ని చూసినా, ఆయనను వేడుకున్నా, ఆయనను నిలదీసినా, ముద్దులాడినా, ఏదిచేసినా అన్నమయ్య మనకందించిన పదాల విందు ఆయన్ని పదకవితా పితామహుని చేసాయి. అన్నమయ్య కీర్తనలను గానం చేస్తూ, అన్నమయ్య పదకోకిలగా సుపరిచితులు శోభారాజుగారు "తందనాన ఆహి, తందనాన పురే, తందనాన భళా తందనాన" కీర్తనతో ఆనాటి కచేరీ ముగించారు. కాని ఆమె పాట నేటికీ ప్రతిధ్వనిస్తూనే ఉంది.

"గాయని శోభారాజుకు
న్యాయంగా అన్నమయ్య నందనుడేమో
ఆయమ పాడినదేనట
గేయంగా తాను లిఖించె కేరలక్ష్మి"
అని ఆరుద్రగారు అన్నారంటే అది వాస్తవం కంటే వాస్తవం.

ఈ కార్యక్రమానికి తగిన విధముగా వాద్య సహకారము అందించిన కళాకారులకు (వీణ : వి. ఫణి నారాయణ గారు, తబలా : కాకర్ల సాంబశివరావు గారు, మరియు కీ బోర్డు కళాకారులు) అభినందనీయులు. ఈ కార్యక్రమానికి వారి వాద్య సహకారం మరింత శోభను కూర్చింది.

మరునాడు మా మిత్రుని ఇంటిలో ఆమెతో మాట్లాడే అవకాశం వచ్చింది. అమె తలపెట్టిన ఎన్నో సేవాకార్యక్రమాలను గురించి, సంగీత పాఠశాలను గురించి తెలియజేసారు. ఆమె మొదటిసారి అమెరికా వచ్చేముందు జరిగిన ఓ సంఘటన గురించి ఆ సమయములో గుర్తు చేసుకోవడము జరిగింది. అప్పటికే తిరుమల తిరుపతి దేవస్థాన ఆస్థాన గాయనిగా ఉన్న ఆమె, తొలిసారి అమెరికా వస్తున్న సందర్భములో స్వామివారి దర్శనార్థం తిరుమల వెళ్ళడం జరిగింది. కాని భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడముతో, ఆమెకు కూడా ద్వారము వద్ద ఎక్కువసేపు నిలుచునే అవకాశము దొరకలేదు. ఇది మనందరికీ కూడా చాలాసార్లు జరిగింది. కాని ఆశాభంగము పొందిన ఆమెకు ఆశువుగా ఓ పాట వెలువడిందట. ఆ పాటను ఆమె పాడుతుంటే మాకు కళ్ళు చెమర్చాయి. ఆ పాటను యధాతథంగా వ్రాయలేకపోతున్నాను. కాని దాని భావము మాత్రము ఇంచుమించుగా ఇది. "మండుటెండలో కాలినడకన ఇన్ని మెట్లు ఎక్కి వస్తే, క్షణమైనా నిన్ను చూసే భాగ్యము కలగలేదు. ఎన్నో విషయాలు విన్నవించుకోవాలని వస్తే, నిన్ను స్తుతించే భాగ్యమే కలుగలేదు. నీ కాళ్ళు కడిగే అవకాశములేక నా కన్నీళ్ళు వృధాగా నేలపాలవుతున్నాయి దేవా! నీ భక్తులను చిన్నచూపుచూస్తున్న ఇటకు నేనిక రాను. కరుణిస్తే నీవే నా వద్దకు రావయ్యా!" అని విన్నవించుకున్నారట. తథాస్తు! అన్నాడేమో ఆ తిరుమలేశుడు. అన్నమయ్యపురంలోనే వేంకటేశ్వరుడు నెలకొన్నాడు. భక్తులపాలిటి కల్పతరువైన ఆయన కరుణా కటాక్ష వీక్షణలు మనందరిపైనా కురవాలని కోరుకుంటున్నాను. అన్నమయ్య రచనల గురించి, అన్నమయ్య జీవిత విశేషాల గురించి తెలుసుకోవాలంటే http://www.annamayya.org ను సందర్శించండి.





సంఘమిత్రను చూసి అభినందిస్తూ ..

కొండలలో నెలకొన్న కోనేటి రాయుడువాడు,
కళ్ళముందు ప్రత్యక్షమైనాడు ఆనాడు,
మానస పుత్రిక డాక్టర్. శోభారాజుగారి
శ్రావ్యమైన అన్నమయ్య సంకీర్తనలు వినగోరి.

